క్లుప్తంగా

ఉపాధిహామీ పనుల పరిశీలన

మణుగూరురూరల్: మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయితీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీటీసీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపూడి కోటేశ్వరరావు మంగళవారం సందర్శించి పరిశీలించారు. అక్కడ పనులను నిర్వహిస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడుతూ.. వారి ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పనులను వివరాలను ఆయన సంబంధిత ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రామారావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని, మస్టర్లను సక్రమంగా వేయాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక



మాంసం దుకాణాల సంఘం నూతన కమిటీ బాధ్యులు..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మాంసం దుకాణాల సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంత మార్కెట్ ఆవరణలో సీపీఐ నియోజకవర్గ నాయకుడు ఎస్‌డి.సలీం ఆధ్వర్యంలో సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా దుబచర్ల హేమంత్ కుమార్, షేక్ కరీంలను, గౌరవ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. కమిటీ కార్యవర్గ సభ్యులుగా దుర్గా చారి, చౌదరి, ఆసిఫ్ అలీ, ఎండి.తహసీన్, షేక్ వాజిద్‌లు ఎన్నికయ్యారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక

దమ్మపేట: మండల పరిధిలోని గణేష్‌పాడు గ్రామానికి చెందిన యువకుడు ఒకే దఫాలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గణేష్‌పాడుకు చెందిన రావి గోవర్ధన్ ఇటీవల ప్రకటించిన బీసీ గురుకుల ఫలితాల్లో గణిత విభాగంలో జూనియర్ లెక్చరర్, టీజీటీ గణితం, టీజీటీ భౌతిక శాస్త్రం విభాగాల్లో ఉద్యోగాలను సాధించి, పలువురి ప్రశంసలు పొందాడు. కాగా సోమవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సభలో ఆ మూడు ఉద్యోగాలకు సంబంధించిన నియమాక పత్రాలను తెలంగాణ ప్రభుత్వం నుంచి అందుకున్నారు.

మాజీ వార్డు మెంబర్‌కు కొలువు..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం గ్రామ పంచాయతీ డ్రైవర్స్ కాలనీకు చెందిన జుజ్జూరపు స్వాతి తాజా, మాజీ వార్డు మెంబర్‌గా పని చేసింది. కాగా, ఇటీవలే విడుదలైన గురుకుల పోస్టుల్లో స్వాతి టీజీటీగా ఉద్యోగం పొందింది. మంగళవారం ఉన్నతాధికారుల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. స్వాతి సర్కారు కొలువు సాధించడం తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో తాగునీటి కొరత రావొద్దు

గుండాల: ఈ వేసవి కాలంలో తాగునీటి కోసం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, జెడ్పీటీసీ కొమరం హన్మంతులు అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పూర్తి చేసిన పనులపై వివిధ శాఖల అధికారాలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ వేసవిలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీళ్లు అందేలా చూడాలని అన్నారు. ప్రతీ ఒక్కరికి జాబ్ కార్డు అందించాలన్నారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, ఎంపీడీఓ రమాదేవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా లైన్‌మెన్ దివస్

బూర్గంపాడు: సారపాకలోని విద్యుత్ కార్యాలయంలో లైన్‌మెన్ దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌లను ఏఈ ఉపేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్ మాట్లాడుతూ.. లైన్‌మెన్‌లు విధి నిర్వహణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

భూ సమస్యపై ఫిర్యాదు

అశ్వాపురం: భూ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలంటూ మొండికుంట గ్రామానికి చెందిన మహిళ పసుల పూలమ్మ మంగళవారం తహసీల్దార్ స్వర్ణలతకు ఫిర్యాదు చేసింది. ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిని తమ పేరు మీద పట్టా చేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ ఎన్నో ఏళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, దానిని వేరే వాళ్లకు పట్టా చేశారని వివరించింది. తమకు న్యాయం చేయాలని మహిళ తహసీల్దార్‌ను కోరింది. విచారణ జరిపి న్యాయం చేస్తానని తహసీల్దార్ స్వర్ణలత మహిళకు తెలిపారు.

ఇవేం పనులు..!?

- అశ్వారావుపేటలో మధ్యలోనే నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్ నిర్మాణం
- నడిరోడ్డుపై గుంతలు తవ్వి వదిలేసిన వైనం
- కిలోమీటర్ల మేర కమ్ముకుంటున్న దుమ్ము



రింగ్ సెంటర్ మసీదు వద్ద గుంతలు

అశ్వారావుపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం చివరినాళ్లలో అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హామీలిచ్చారు. అంతేకాకుండా హడావుడిగా రూ.23 కోట్లతో టెండర్ పిలవడం.. పనులు మొదలుపెట్టడం వరకు బాగానే సాగింది. తీరా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆద్యంతం నాణ్యతాలోపాలతో పనులు చేపట్టడంతో పాటు తాను అప్పటి ఓ మంత్రి బినామీనంటూ అధికారులను బెదిరించే వాడని సమాచారం. దీంతో అధికారులు ఆగ్రహంతో ఎక్కడికక్కడ బిల్లులు నిలిపేశారు. డివైడర్ల నిర్మాణం కోసం తరలించిన రాళ్లు నాణ్యమైనవి కావని, సీసీ వాల్ నిర్మాణంలో సరిగ్గా లేదని పేర్కొన్నట్లు సమాచారం. సదరు కాంట్రాక్టర్ ఉమ్మడి జిల్లాలో ఎక్కడ పని దక్కించుకున్నా.. అప్పటి మంత్రి బినామీనని అధికారులను బెదిరించడం ఆనవాయితీగా కొనసాగేదని తెలిసింది. కానీ అశ్వారావుపేటకు వచ్చేసరికి అధికారులు వినకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి ప్రజలు అవస్థ పడుతున్నారు. డివైడర్ నిర్మించకపోయినా ఫర్వాలేదు.. తవ్విన గుంతలు, రహదారికి పడిన గుంతల్లో వెట్‌మిక్స్ పోసి వదిలేసిన సరిచేయడమే కాక బీటీ లేయర్ నిర్మించేంత వరకు దుమ్ము లేవకుండా రహదారిని తడపాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు

అశ్వారావుపేటలో అత్యంత ప్రమాదకర కూడలి అయిన రింగ్ సెంటర్‌లో ఇప్పటి వరకు చాలా ప్రమాదాలు జరిగాయి. లారీలు బోల్తా పడటం వంటి ఘటనలు ఇక్కడ సర్వసాధారణం. అలాంటి ప్రమాదకర కూడలిలో భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతలను తాత్కాలికంగా పూడ్చేందుకు వెట్‌మిక్స్ (కంకర రాళ్లు, బూడిద మిశ్రమం) వాడడంతో వాహనాల తాకిడికి రాళ్లు ఎగిరి పడడం, దుమ్ము వ్యాపించడం జరుగుతోంది. దీంతో అశ్వారావుపేట, పేరాయిగూడెం గ్రామపంచాయతీల మధ్య ఈ జాతీయ రహదారి వెంట మూడు కిలోమీటర్ల మేర ఇరువైపులా దుమ్ము కప్పేస్తోంది. వాటర్‌సర్వీసింగ్ యూనిట్లు, కూరగాయల దుకాణాలు, మాంసం దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, పాల దుకాణాలు నిర్వహించే వారికి ఈ దుమ్ము శాపంగా పరిణమించింది. దుమ్ము ధాటికి తట్టుకోలేక పలువురు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. ఇదే సమస్యను తాజా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకైతే ఫలితం కానరాలేదు. స్వయంగా ఎమ్మెల్యే ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించినా.. వారి తీరులో కానీ కాంట్రాక్టర్ తీరులో కానీ మార్పు రాకపోవడంతో ప్రజలు దుమ్ముతోనే సహజీవనం సాగించాల్సి వస్తోంది.

మొండికేసిన కాంట్రాక్టర్..

ముందుగా చెప్పుకున్నట్లు సదరు మాజీ మంత్రి బినామీ తాను ఏ విధంగా నాణ్యత లేని రాళ్లు ఉపయోగించి గోడలు కడతానన్నాడో అలాగైతేనే పనులు చేస్తానని మొండికేసినట్లు సమాచారం. ప్రస్తుత ప్రభుత్వం, ఉన్నతాధికారులు సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్పా పనులు ముందుకు జరిగేలా కనిపించడం లేదు. దీనికితోడు డివైడర్ నిర్మాణం ఏటవాలుగా ఉండాల్సింది పోయి నిటారుగా కట్టడం గమనార్హం. డివైడర్ ఎత్తుకు వెళ్లే కొద్దీ వెడల్పు తగ్గాల్సిందిపోయి నట్టనిలువుగా ఏర్పాటు చేశారు. దీనివల్ల వాహనాల్లో నుంచి ఎవరైనా బాడీ బయకుపెడితే ప్రమాదాలు జరుగుతాయి. పైగా సీసీ గోడ నిర్మించి దానికి రాళ్లు అతికించిన మూలంగా నిర్మాణంలో రాళ్లు ఊడి పోయే ప్రమాదం ఉంది. నిరక్షరాస్యుడైన తాపీ మేస్త్రీలు కూడా పాటించే ఈ చిన్న లాజిక్‌ను కూడా అధికారులు, కాంట్రాక్టర్ పాటించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో పరిశీలించి నాణ్యత లేని కట్టడాలను తొలగించాల్సి వస్తే మొత్తాన్ని పునర్నిర్మించాల్సి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. నాణ్యతను పరిశీలించి దుమ్ము సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. పనులు పూర్తి చేసేలా చర్యలు జరుపుతున్నాం. ఆ లోగా గుంతలు, దుమ్ము వల్ల స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– కృష్ణార్జునరావు, ఆర్‌అండ్‌బీ జేఈఓ

ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తుంది..



అశ్వాపురం: గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

అశ్వాపురం: ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో అశ్వాపురం ఎస్సీ కాలనీలో గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల లోపు ఉన్న పలువురు లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే పాయం జీరో బిల్లులు అందజేశారు. సీతరాంపురం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాయం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు పిట్టా కృష్ణారెడ్డి సోదరి గంటా అరుణ మృతదేహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మణుగూరు ఏడీఈ జీవన్‌కుమార్, ఏఈ శ్రీనివాసరావు, సబ్ ఇంజినీర్ మణిదీప్, ఎంపీపీ ముత్తినేని సుజాత, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఖదీర్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, గాదె కేశవరెడ్డి, చంద్రకళ, ఓరుగంటి రమేష్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

మణుగూరుటౌన్: స్థానిక ప్రజాభవన్ కార్యాలయం (ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్)లో లబ్ధిదారులకు మంజూరైన నాలుగు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి, డీటీ కృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వినతులు..

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా నుంచి బాడీ బండ్లకు బొగ్గును నిలిపివేశారని, దానిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తాము పూర్తిగా రోడ్డున పడే పరిస్థితి ఉందని బొగ్గు లారీ ఓనర్లు మంగళవారం ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వివరించారు. స్థానిక అధికారులు లోడింగ్ నిలిపివేశారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరు ఏరియా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. మరోవైపు పోడు భూముల సమస్యలతో పాటు పట్టా పాస్ పుస్తకాల జారీలో జాప్యంపై బాధితులు కలవగా, వెంటనే సంబంధిత రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ఆదివాసీలకే సీటు ఇవ్వాలి

దుమ్ముగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ సీటును అన్ని రాజకీయ పార్టీలు ఆదివాసీ అభ్యర్థులకే కేటాయించాలని అఖిలపక్ష జేఏసీ సంఘాల నాయకుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చెరుపల్లి, కొత్తపల్లి, కోయనరసాపురం, మారాయిగూడెం, భీమవరం, పెద్దార్లగూడెం, లచ్చిగూడెం, చిన్నార్లగూడెం, కాటాయగూడెంలలో అఖిలపక్ష జేఏసీ సంఘాల నాయకులు విస్తృతంగా పర్యటించి కరపత్రాలను పంచారు. గడిచిన పదేళ్ల కాలంలో మహబూబాబాద్ పార్లమెంటు సీటును వలస లంబాడీ సామాజిక వర్గానికి కట్టబెడుతున్నారే తప్ప నిజమైన ఆదివాసీలకు ఇవ్వకుండా తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సారి కూడా లంబాడాలకే కేటాయిస్తే వారిని ఓడగొట్టడానికి గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. జేఏసీ సంఘాల ప్రతినిధులు పాయం సత్యనారాయణ, కోడి చంటి, సోయం శుక్రు, కాటేబోయిన సాయి, శ్యామల వెంకటేష్, కొర్స జగదీష్, పెనుబల్లి వెంకటేష్, సోందే చిన్నక్క పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

దమ్మపేట: మండల కేంద్రంలో సగర కుల సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో సగర సంఘం మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సగర సంఘం రాష్ట్ర కార్యదర్శి గుంటి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కొడిపాక మల్లేష్ హాజరయ్యారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం నాయకులు మాట్లాడారు. సగర నాయకులు అనిశెట్టి భిక్షపతి, గండికోట వెంకటేశ్వరరావు, పందేటి వెంకటేశ్వరరావు, వెంకయ్య, బుజ్జిబాబు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కొర్రాజులగుట్ట కాంప్లెక్స్ పరిధిలోని సీపీఎస్ ఉద్యోగుల పీఆర్‌సీ, డీఏ, ఏరియల్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రామకృష్ణకి మంగళవారం ఎస్‌టీఓలతో పాటు వినతిపత్రం అందజేశారు.

వంద శాతం పల్స్ పోలియో పూర్తి

కరకగూడెం: మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా, వందశాతం పూర్తి చేసినట్లు కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కారం మధు తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పల్స్ పోలియో ఇంటింటి సర్వేను పరిశీలించారు. మిగిలిన చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పల్స్ పోలియో కార్యక్రమంపై మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది రెండు రోజులుగా ఇంటింటి సర్వే నిర్వహించారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని శివలింగాపురం, సుందరయ్యనగర్, సమితిసింగారం తదితర ప్రాంతాల్లో సర్వే నిర్వహించి 14మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.



కరకగూడెం: ఓ చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

సర్వే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ బాలాజీ నాయక్ సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో మణుగూరు పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, సీహెచ్‌ఓలు నాగభూషణం, వెంకటేశ్వరరావు, పిహెచ్‌ఎన్ సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పామాయిల్ రైతుల సమావేశం

అశ్వారావుపేటరూరల్: స్థానిక రైతు వేదిక ఆవరణలో నేడు(బుధవారం) అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని పామాయిల్ రైతులతో ముఖాముఖి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పామాయిల్ రైతు సంఘం బాధ్యులు తెలిపారు. ఈ సమావేశానికి ఖమ్మం సెంట్రల్ బ్యాంక్ సీఈఓతోపాటు, పలువురు ఉన్నతాధికారులు హాజరవుతారని అన్నారు. సెంట్రల్ బ్యాంక్ ద్వారా పామాయిల్, దీర్ఘకాలిక రుణాల గురించి చర్చ ఉంటుందన్నారు. పామాయిల్ రైతులంతా హాజరు కావాలని కోరారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

అశ్వారావుపేటరూరల్: ఓ జామాయిల్ తోటలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానిక ఇన్‌చార్జ్ అగ్నిమాపక శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలోగల జల్లిపల్లి భ్రమరాంబ అనే మహిళా రైతుకు చెందిన జామాయిల్ తోటలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పడేయడంతో మంటలు అంటుకున్నాయి. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తోటలో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రెండున్నర ఎకరాల్లో ఉన్న జామాయిల్ చెట్లు కాలిపోగా.. బాధిత రైతుకు సుమారు రూ.90వేల నష్టం వాటిల్లిందని ఫైర్ అధికారి తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

అశ్వాపురం: మండలంలోని బట్టీలగుంపు పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎంపీపీ ముత్తినేని సుజాత మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే ఖదీర్, సహకార సంఘం డైరెక్టర్ కుంజా శ్రీను, మాజీ సర్పంచ్ బట్టా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

అశ్వారావుపేటరూరల్: ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి చేరే విధంగా లక్ష్యంగా పెట్టుకుని చదువుకోవాలని అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏలైవ్ యూత్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లను వితరణ చేశారు. వీటిని ఎస్సై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం అదృష్టమని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించానని అన్నారు. పది పరీక్షలకు సంబంధించి మంచి ప్రణాళికతో ముందుకెళ్లి ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, బాలస్వామి, నాగేశ్వరరావు, మధుసూధన్, సలీం పాషా, శోభారాణి, రామిరెడ్డి, కాంతారావు, యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు చొక్కా అశోక్ బాబు, హరిష్, చిప్పనపల్లి శ్రీను, బిందు, సందీప్, దయాసాగర్ పాల్గొన్నారు.

కార్యకర్తలను అవమానించకండి..



ఆదివాసీల పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దుమ్ముగూడెం: గెలిపించిన కార్యకర్తలను అవమానించి, హేళన చేసే విధంగా ఉండొద్దన్ని ఆదివాసీల పేరు మీద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ములకపాడు గ్రామంలోని ప్రధాన రహదారిపై ఈ ఫ్లెక్సీలు కనిపించాయి. కమ్యూనిస్టు నాయకులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, గుమ్మడి నర్సయ్యలు ఆదివాసీ జాతి కీర్తి ప్రతిష్ఠలను నాలుగు దిక్కుల వ్యాపింపజేశారని, వారి వారసత్వాన్ని కొనసాగించాని ఫ్లెక్సీల్లో సూచించారు. ప్రజల నిర్ణయాన్ని, కార్యకర్తల శ్రమను తొసిపుచ్చి నాయకులు నిర్ణయాలు తీసుకోవద్దని, దీనివల్ల ఇప్పుడిప్పుడే చైతన్యం పొందుతున్న ఆదివాసీల నమ్మకాన్ని కోల్పోతారని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. కాగా, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పార్టీ మారుతారన్న వార్తల నేపథ్యంలో ఈ ఫ్లెక్సీలను పెట్టి ఉంటారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు



కరకగూడెంలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగప్రసాద్

కరకగూడెం: మండలంలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని పరిశీలించి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఈ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారనే సమాచారంతో పరిశీలించానని అన్నారు. ఈ స్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా పబ్లిక్ టాయిలెట్లు, బస్టాండ్ నిర్మాణం చేపడుతామని పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రంలోని డ్రెయినేజీని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న పలువురు దుకాణదారులకు నోటీసులు ఇచ్చి వెంటనే సామాన్లు తొలగించాలని హెచ్చరించారు. లేని పక్షంలో చర్యలు తప్పవని పేర్కొన్నారు. అదేవిధంగా భట్టుపల్లి వద్ద ఉన్న కేజీబీవీని మరలా ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెనూ పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఆగిన ప్రహరీ నిర్మాణ పనులను కూడా వెంటనే ప్రారంభించాలని గుత్తేదారునితో ఫోన్లో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో మట్టి పోయించి పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో డీటీ సంధ్య, ఆర్‌ఐలు షేక్ హుస్సేన్, రాజు, సర్వేయర్ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది నరేష్, అఖిల్, కొండయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. సుజాతనగర్‌కు చెందిన భార్యభర్తలు తిరుమలరావు, రమణ టీవీఎస్ వాహనంపై అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గమధ్యలోని తిప్పనపల్లి వద్ద జాతీయ రహదారిపై వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిరువురూ గాయపడగా.. 108 అంబులెన్స్‌లో కొత్తగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి..

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి మంగళవారం తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన మొల్లి కొండలరావు ద్విచక్రవాహనంపై సత్తుపల్లి నుంచి వస్తున్న క్రమంలో అశ్వారావుపేట మండలం శ్రీరంగాపురం వద్ద ఆటో అదుపు తప్పి ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో కొండలరావు కుడి కాలు విరిగింది. గమనించిన స్థానికులు చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం అందించగా.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికు తరలించారు.

కారు ప్రయాణికులకు..

మణుగూరురూరల్: మండల పరిధిలోని విజయనగరం గ్రామం వద్ద కారును లారీ ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. లారీ ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన కు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అభివృద్ధికి నిధులు కేటాయించండి




డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మంగళవారం హైదరాబాద్‌లో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్టీ నియోజకవర్గమైన అశ్వారావుపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన డిప్యూటీ సీఎం నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చిన్నారికి పరామర్శ

ప్రమాదంలో కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారిను మంగళవారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. మండలంలోని కుడుములపాడు గ్రామానికి చెందిన పూనెం మీనాక్షి అనే చిన్నారి కొద్ది నెలల క్రితం ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో దాదాపు 70 శాతం కాలడంతో తీవ్రంగా గాయపడింది. కాగా ఇటివలే కుడుములపాడులో పర్యటించిన ఎమ్మెల్యే ఈ చిన్నారికి పూర్తి స్థాయి వైద్యం అందించేందుకు హైదారాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికు తరలించారు. అయితే అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మీనాక్షి వద్దకు వెళ్లి స్వయంగా మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. తక్షణమే చిన్నారికి శస్త్రచికిత్స చేసేందుకు రక్తం అవసరమని వైద్యులు చెప్పడంతో ఎమ్మెల్యే మూడు యూనిట్ల రక్తం అందించేందుకు దాతలను సిద్ధం చేసి, రక్త దానం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నారికి అవసరమైన పూర్తి వైద్యానికి కృషి చేస్తానని, కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మణుగూరురూరల్: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్

మణుగూరురూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మణుగూరు ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో సింగరేణియుల మహిళలకు, యువతులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమితి రామచందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ప్రశాంతతకు, ఉత్సాహానికి ఎంతో దోహదపడుతాయన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సింగరేణి సంస్థ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తోందన్నారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన మహిళలకు 7వ తేదీన జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలోఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు వీసం రమా కృష్ణయ్య, డీజీఎం(పి) ఎస్ రమేష్, సీనియర్ పీఓ ఎస్.శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, సేవా సభ్యులు జమీల బేగం, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విలువలు నేర్పించాలి

ములకలపల్లి: తల్లులు తమ పిల్లలకు విలువలతో కూడిన బాల్యాన్ని అందించాలని ఎంపీడీఓ భారతి, దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ జ్యోతి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలకేంద్రంలోని గుడ్‌షఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడారు. చిన్నారుల చదువులపట్ల నిర్లక్ష్యం చేయకుండా, విద్యలో రాణించేలా తల్లులు ప్రోత్సహించాలని అన్నారు. స్త్రీలు తమను తాము బహీనులుగా భావించవద్దని సూచించారు. మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం మండలపరిధిలో వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సీత, కానిస్టేబుల్ అశ్విని, డీసీసీ బ్యాంక్ క్లర్క్ స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సామ్రాజ్యం, సుందరి, సిస్టర్స్ నిర్మల, దీప్తి, రాజ్యం, సంస్థ సిబ్బంది సుజాత, వెంకటలక్ష్మి, నాగరాజు, ముత్యం. బాలరాజు, సందీప్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.